ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ తరలింపు

- త్వరలో కుర్మిద్ద తాత్కాలిక భవనంలోకి ఫార్మా పీఎస్
- ప్రస్తుతం మేడిపల్లిలో కొనసాగుతున్న పీఎస్..
- మార్చొద్దని ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మేడిపల్లిలో ఉన్న ప్రస్తుత పీఎస్

కుర్మిద్దలో ప్రారంభానికి సిద్ధం చేసిన పీఎస్

యాచారం, జూన్ 8 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ప్రాజెక్ట్ పరిధిలోని యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాలకు భద్రతను కల్పించేందుకు ప్రత్యేకంగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని మేడిపల్లిలో 2023లో ఏర్పాటు చేశారు. ఫార్మాసిటీ భద్రత కోసం మేడిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను త్వరలో కుర్మిద్దకు తరలించనున్నారు. కందుకూరు, కడ్తాల్ మండలంలోని దూర ప్రాంతాల ప్రజలకు అనుకూలంగా, అన్ని వేళల అందుబాటులో ఉండేందుకు ఠాణాను కుర్మిద్దకు తరలిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. త్వరలో కుర్మిద్దలోని తాత్కాలిక భవనంలోకి ఠాణాను మార్చనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కందుకూరు, యాచారం మండలాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ భద్రతకు స్థానికంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అప్పట్లో ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం అనుకున్నదే తడవుగా అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో రాచకొండ కమిషనర్ సమక్షంలో యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని 20 గ్రామాలు, వాటి అనుబంధ గ్రామాలను కలుపుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లిలో అద్దె భవనంలో 'హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా'ను ఏర్పాటు చేసింది. సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు ఏఎస్సైలు, 20 మంది పోలీస్ సిబ్బందిని నియమించింది. ఫార్మా పోలీసుల పహరాలో ఫార్మా భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు కొనసాగుతున్నాయి.

త్వరలో ఫార్మా పీఎస్ తరలింపు..

ఫార్మాసిటీ పీఎస్‌ను యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నుంచి కుర్మిద్ద గ్రామానికి తరలించనున్నారు. మేడిపల్లిలో ఉన్న పీఎస్ కందుకూరు మండల ప్రజలకు దూరం కావడంతో అందరికీ అందుబాటులో ఉండేలా అన్ని గ్రామాలకు మధ్యలో ఉండేలా పోలీస్ స్టేషన్‌ను తరలిస్తున్నారు. కుర్మిద్దలో గతంలో ఓ అద్దె భవనంలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అదే భవనంలోకి మేడిపల్లి నుంచి ఫార్మా పీఎస్‌ను త్వరలో మార్చనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు ఇప్పటికే ముమ్మరంగా జరుగుతున్నాయి. పీఎస్ తాత్కాలిక భవనానికి మరమ్మతులు చేశారు. ఈ పనులను సీఐ లిక్కి కృష్ణంరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఈ భవనాన్ని పరిశీలించారు. మరో రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి కానుండడంతో త్వరలోనే పీఎస్‌ను కుర్మిద్దకు మార్చేందుకు పోలీస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మేడిపల్లి నుంచి పోలీస్ స్టేషన్ తరలించవద్దని ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీఎస్‌ను తరలిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

అందరికీ అందుబాటులో ఫార్మా పీఎస్

ఫార్మాసిటీ పీఎస్‌ను అందరికీ అందుబాటులో ఉండేలా యాచారం మండలం మధ్యలో ఉన్న కుర్మిద్ద గ్రామానికి త్వరలో మార్చబోతున్నాం. అక్కడ తాత్కాలిక భవనంలో పీఎస్‌కు తగిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. త్వరలో పోలీస్ స్టేషన్‌ను కుర్మిద్దకు తరలిస్తాం. ఇందుకోసం ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశాం. త్వరలో సొంత స్థలంలో పక్కా భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. **- లిక్కి కృష్ణంరాజు, సీఐ, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్**

పీఎస్ పరిధిలోకి 19 గ్రామాలు

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని 19 పంచాయతీలు వాటి అనుబంధ గ్రామాలు రానున్నాయి. యాచారం మండలంలోని మేడిపల్లి, నక్కర్త, నానక్‌నగర్, పిల్లిపల్లి, తాటిపర్తి, గొల్లగూడ, కుర్మిద్ద, మర్లకుంటతండా, కందుకూరు మండలం నుంచి సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, ఉట్లపల్లి, మీర్‌ఖాన్‌పేట, ఆకులమైలారం, పంజాగూడ, మాలగూడ, బేగరికంచె, సార్లరావులపల్లి, సార్లరావులపల్లి తండా, బండమీదితండా, గుట్టలతండా, పోచమ్మగడ్డతండా, పోతుగడ్డతండా, కడ్తాల మండలంలోని పల్లెచెల్కతండాను ఎంపిక చేశారు.

ఎమ్మెల్యే మాగంటి మృతి పార్టీకి తీరనిలోటు

- సంతాపం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- పట్టణ ముఖ్యకూడలిలో నివాళులర్పించిన బీఆర్ఎస్ శ్రేణులు

షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

షాద్‌నగర్‌టౌన్, జూన్ 8 : జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకుడు మాగంటి గోపినాథ్ మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. ఆయన మృతిపై ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎల్లపుడూ అందుబాటులో ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు పట్టణ ముఖ్యకూడలిలో ఎమ్మెల్యే మాగంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా ఆయన ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, నాయకులు మన్నె నారాయణ, చంద్రశేఖర్, లక్ష్మణ్‌నాయక్, వీరేశం, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రాఘవేందర్, శరత్‌కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న మహాజన సోషలిస్టు పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

వికారాబాద్, జూన్ 8 : సమాజ హితమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ పోరాడుతున్నదని అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలని మహాజన సోషలిస్టు పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ తెలిపారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ.. మాదిగ సమాజానికి దక్కాల్సిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే మరోవైపు నిరాధరణకు గురైన దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల కోసం పోరాడి వారికి పింఛన్లు సాధించారని తెలిపారు. గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ పథకం, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళల భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, తెల్ల రేషన్ కార్డుదారులకు 6 కిలోల బియ్యం పెంపు తదితర ఫలితాలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణమాదిగ నాయకత్వంలో సాధించారని గుర్తు చేశారు. ఈ ఫలాలు మాదిగల కోసమే చేసినవి కావని.. అన్ని వర్గాల సంక్షేమం కోసం సామాజిక బాధ్యతతో చేసిన ఉద్యమాలన్నారు. వర్గీకరణ సాధించిన నేపథ్యంలో సమాజానికి కృతజ్ఞతగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణతో ముందుకు సాగుతామన్నారు. ఈ విజయానికి కారణం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అన్ని వర్గాలు అందించిన సహకారమే అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాశ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి సుభాశ్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు గుట్టకింది రవి కుమార్ మాదిగ, మహిళా నాయకురాలు అన్నపూర్ణ మాదిగ పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ ఇండ్ల పట్టాలివ్వాలి

పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 8: భూదాన్ భూమిలో గుడిసెలు వేసుకున్న ప్రతి పేదవాడికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-2లో చిర్ర శేఖర్ అధ్యక్షతన ఆదివారం సీపీఐ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. భూదాన్ భూమిలోని గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మంచినీటి సౌకర్యం, కరెంటు వసతి కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.1200 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం రావినారాయణరెడ్డి కాలనీ-2 శాఖ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చిర్రా శేఖర్, సహాయ కార్యదర్శులుగా వేటూరి ఈశ్వరయ్య, మహేందర్, 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పబ్బతి లక్ష్మణ్, అజ్మీరా హరిసింగ్‌నాయక్, సంఘాల నాయకులు వేణుగోపాలచారి, వెంకన్న, పుల్లయ్య, అరుణ, నవనీత, నిరంజన్, కాశి, దేవమ్మ, సుజాత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో గోమాంసం పెట్టించిన నిందితుడిని శిక్షించాలి

శివాంజనేయస్వామి ఆలయం ఎదుట భక్తులు, పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యుల నిరసన

ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులతో మాట్లాడుతున్న కొందుర్గు, చౌదరిగూడ రూరల్ సీఐ నర్సింహ

షాద్‌నగర్ టౌన్, జూన్ 8 : మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పట్టణంలోని పటేల్‌రోడ్డులో ఉన్న శివాంజనేయస్వామి ఆలయం వద్ద ఓ గుర్తు తెలియని దుండగుడు గోమాంసం ఉన్న కవర్‌ను ఆలయంలో పెట్టమని ఓ చిన్నారికి ఇవ్వగా ఆమె అక్కడ పెట్టింది. మధ్యాహ్న సమయంలో ఆలయానికి వచ్చిన ఆలయ అధ్యక్షుడు కవర్‌లో ఏముందో అని చూడగా అందులో గోమాంసాన్ని గుర్తించి స్థానికులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్‌కుమార్, పోలీసులు, బీజేపీ, విశ్వ హిందూ పరిషత్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను సేకరించారు. ఆలయంలో గోమాంసాన్ని పెట్టించిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బీజేపీ, హిందూ వాహిని, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఆలయం ఎదుట నిరసనకు దిగగా.. నిందితుడిని పట్టుకుని చర్యలు తీసుకుంటామని కొందుర్గు, చౌదరిగూడ రూరల్ సీఐ నర్సింహ వారికి నచ్చజెప్పారు. కార్యక్రమంలో బీజేపీ, హిందూవాహిని, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు బాబయ్య, ప్రశాంత్, ధనరాజ్, గోపాల్, అంజిబాబు, రంజిత్, రామకృష్ణ, విజయ్, లక్ష్మణ్, గోపి, రాజేశ్, ప్రసాద్, నవీన్, రాజు, రమణ, లక్ష్మణ్, కృష్ణ, శేఖర్, రమేశ్, ఓంకార్, స్యామ్, ప్రవీణ్, శ్రీను, ఆనంద్, రవి, ప్రవీణ్, శ్రీనివాసులు, దేవేందర్, సందీప్, అరుణ్, శేఖర్, భాస్కర్, రవితేజ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

ల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

కడ్తాల్, జూన్ 8 : కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యానికి ఖూనీ జరుగుతున్నదని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి గిరిజన సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్‌ను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ సర్కార్ చేతులేత్తిసిందని విమర్శించారు. రేవంత్ సర్కార్ మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదని, హామీలను నెరవేర్చే వరకు పోరాటాలు ఆగవని హెచ్చరించారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

19 మంది పందెంరాయుళ్లతో పాటు నగదు స్వాధీనం

పోలీసుల అదుపులో కోడి పందేల రాయుళ్లు

ఆదిబట్ల, జూన్ 8 : గుట్టు చప్పుడు కాకుండా బహిరంగ ప్రదేశంలో కోడిపందేలు ఆడుతున్న స్థావరంపై ఎస్‌వోటీ మహేశ్వరం జోన్ బృందం, ఆదిబట్ల పోలీసులతో కలిసి దాడి చేసిన ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎంకుంట గ్రామంలోని వ్యవసాయ భూమిలో బహిరంగంగా కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. వెంటనే ఆ స్థావరంపై దాడి చేసి, 19 మంది కోడిపందేల రాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.19,540 నగదు, 12 కోడి పందేలా కత్తులు, మూడు పందేల దారాలు, 36 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు.

చదవండి.. బాగు చేయండి

రోడ్డుపై వెలిసిన ఫ్లెక్సీపై సర్వత్రా చర్చ

అంబేద్కర్ చౌరస్తాలో అధ్వానంగా మారిన రోడ్డు

పెద్దఅంబర్‌పేట, జూన్ 8: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం అంబేద్కర్ చౌరస్తాలో అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలంటూ వెలిసిన ఓ ఫ్లెక్సీ ఆకట్టుకుంటున్నది. 'నన్ను చదవండి.. బాగు చేయండి' అని మొదలైన ఫ్లెక్సీలోని రాతలు కట్టి పడేస్తున్నాయి. 'గౌరవనీయులైన ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు.. మాట్లాడుతున్నది నేను, మీ రోడ్డును.. ఇప్పుడు బాధలో ఉన్నాను. వర్షాలు పడ్డాయి, తవ్వకాలు నాకు గాయాలు చేశాయి. నా మీద ఉన్న ప్రతి చిల్లు, ఒక ప్రాణం తీసే ప్రమాదం. నన్ను బాగుచేయండి. లేకపోతే ఎవరో గాయపడొచ్చు. ఎవరో ప్రాణమూ కోల్పోవచ్చు. చిన్న జాగ్రత్త చాలు పెద్ద ప్రమాదం తప్పుతుంది. మళ్లీ మీ కోసం పని చేయాలని, నాకు నయం కావాలని ఎదురు చూస్తున్నది మీ రోడ్డు' అంటూ స్థానికుడైన ఏఎస్ చరణ్‌రెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి ఏరియల్ రోడ్డును బాగు చేయాలని స్థానికులు విన్నవిస్తున్నారు. నిత్యం వందలాదిగా వెళ్లే భారీ క్రషర్ వాహనాల కారణంగానే రోడ్డు రాళ్లు తేలి, గుంతలు పడి మరింత దౌర్భాగ్యంగా మారుతున్నా మరమ్మతులు చేసేవారు కరవయ్యారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

చేపమందు కోసం పోటెత్తారు

- ప్రజలతో కిక్కిరిసిన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్
- అరకొర ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి
- క్యూలైన్‌లో నిల్చున్న 75 ఏళ్ల వృద్ధుడి మృతి
- ఆహారం సప్లై చేసిన స్వచ్ఛంద సంస్థలు

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చేపమందు వేస్తున్న బత్తిని సోదరులు

సుల్తాన్ బజార్, జూన్ 8: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిని కుటుంబం నిర్వహించే చేపమందు ప్రసాదం పంపిణీకి ఆదివారం ప్రజలు పోటెత్తారు. అయితే ప్రభుత్వ యంత్రాంగం చేపమందు ప్రసాదం కోసం విచ్చేసే ప్రజలకు అరకొర ఏర్పాట్లు చేపట్టడంతో ఇబ్బందులు తప్పలేదు. మత్స్యశాఖ అధికారులు 35 కౌంటర్లను ఏర్పాటుచేసి చేపమందు ప్రసాదం పంపిణీ చేపట్టారు. కాగా ఈ ప్రసాదం పంపిణీలో క్యూలైన్లలో నిలిచి ఉన్న 75 ఏండ్ల వృద్ధుడు గుండె పోటుతో పడిపోగా అక్కడే ఉన్న వైద్య శిబిరానికి తరలించి అత్యవసర వైద్య చికిత్స, సీపీఆర్ అందించినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అతడు మృతి చెందాడు. మరోవైపు పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీ కోసం విచ్చేసిన ప్రజలకు ఆహారం అందించి మానవత్వాన్ని చాటుకున్నాయి. రాత్రి 7 గంటల వరకు 47వేల చేప పిల్లల ప్రసాదం పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆస్తమా తగ్గుతుందని నమ్మకం..

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేపమందు ప్రసాద పంపిణీని మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు మధుయాష్కీ, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, బత్తిని కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం చాప ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృగశిర కార్తి రోజు చేప ప్రసాదం తినడం వల్ల ఆస్తమా వ్యాధి తగ్గుతుందని చాలామంది నమ్మకమని అన్నారు. 48 గంటలు నిరంతరాయంగా బత్తిని కుటుంబ సభ్యులతో పాటు అన్ని శాఖలు పనిచేస్తున్నాయని అన్నారు. చేప ప్రసాదం పంపిణీ వద్ద స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేసిన వారికి అభినందనలు తెలిపారు.

బత్తిన సోదరులు

నా సతీమణి బంధువులు.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. చేపమందు ప్రసాదం కోసం గతంలో తన సతీమణి కుటుంబం ఢిల్లీ నుంచి వచ్చి చేపమందు తీసుకున్నారని గుర్తుచేశారు. బత్తిని కుటుంబం తన సతీమణి బంధువులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్సీ మంజునాథ్, కార్పొరేటర్ రాఖీ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేపమందు ప్రసాదం పంపిణీ సందర్శించారు. మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, శ్రీనివాసు మాట్లాడుతూ.. ఒక్కో చేప ధర 40 రూపాయలుగా టోకెన్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. గతేడాది 60 వేల చేప పిల్లలను విక్రయాలు చెపట్టామని.. ఈ ఏడాది అంతే సంఖ్యలో ఇంచుమించు విక్రయాలు జరగవచ్చని వారు తెలిపారు.

ప్రసాదం పంపిణీలో అపశృతి..

చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మెదక్ జిల్లాకి చెందిన రిటైర్డ్ ఎంప్లాయ్ సత్యనారాయణ (75) చేప ప్రసాదం కోసం క్యూలైన్‌లో నిలబడగా హార్ట్ స్ట్రోక్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. అతడిని వెంటనే మైదానంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తరలించి తక్షణ వైద్యం, సీపీఆర్ చేసినప్పటికీ అతడు ప్రాణాలు విడిచాడు. అనంతరం సత్యనారాయణ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాగా ఎగ్జిబిషన్ మైదానంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిటీ జాయింట్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, సెంట్రల్ జాన్ డీసీపీ శిల్పవల్లి, అదనపు డీసీపీ ఆనంద్, అబిడ్స్ ఎసీపీ ప్రవీణ్ కుమార్, ఇన్స్పెక్టర్లు భరత్ కుమార్, ఏడుకొండలు బందోబస్తును పర్యవేక్షించారు.

హైరిస్క్ ప్రెగ్నెన్సీకి ఆధునిక సాంకేతికతతో చికిత్స

కార్యక్రమంలో పాల్గొన్న యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి తదితరులు

యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి

మాదాపూర్, జూన్ 8: ప్రసూతి సమయంలో అత్యంత క్లిష్టమైన సందర్భం ఎదురైనప్పుడు తల్లీబిడ్డలను క్షేమంగా ఎలా కాపాడాలనే విషయమై అవగాన కల్పించడమే లక్ష్యంగా ఆదివారం మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్స్‌లో హై రిస్క్ ప్రెగ్నెన్సీ పై లైవ్ వర్క్‌షాప్‌తో పాటు జాతీయ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి విచ్చేసి యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణవేణి నాయినితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోరుకంటి మాట్లాడుతూ... హై రిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను ఏ విధంగా అధిగమించాలో ఈ వేదిక ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. విభిన్న వైద్య విభాగల నుంచి అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్య నిపుణులు హై రిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను అధిగమిస్తూ, నూతన మార్గదర్శకాలు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను మరింత సులభంగా, కచ్చితత్వంతో ఎలా నిర్వహించాలో వారి అనుభవాలను ఈ జాతీయ సదస్సులో పంచుకున్నారని తెలిపారు. ఇలాంటి లైవ్ వర్క్ షాపులు యువ వైద్యులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్, డాక్టర్ కృష్ణవేణి నాయిని మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్ షాప్‌లో హైరిస్క్ ప్రెగ్నెన్సీలో క్లిష్టమైన అంశాలపై లోతైన చర్చ జరిగిందని తెలిపారు. ఇందులో 500 మందికి పైగా గైనకాలజిస్ట్‌లు, సర్జన్ల తో పాటు యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో బెంగళూరు కళాకారులు

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బెంగళూరు కూచిపూడి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో గురువులు లాస్య ఎడార శిష్య బృందం ప్రదర్శనలు అలరించాయి. సాయి రాగ, తేజస్విని, శ్రీ లాస్య, మాన్విత, శాన్వి, అనన్య, సహస్ర, వైష్ణవి, రిత్విక, హర్షితరెడ్డి, సాయి సాన్విక, గౌరి ప్రదర్శించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకున్నది.